

ఏసీ లతకు రాముడి అక్షింతలు

జగిత్యాల: అదనపు కలెక్టర్ లతకు శ్రీరాముడి అక్షింతలను శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అందించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ ఉన్నారు.



వరదకాలువకు నీటి విడుదల

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు రెండు వేల క్యూసెక్కుల నీటిని శనివారం నీటి పారుదల శాఖ అధికారులు విడుదల చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/16.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తుంది. చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

చట్టంముందు అందరూ సమానులే..



సదస్సులో మాట్లాడుతున్న జితేందర్

రాయికల్: చట్టంముందు అందరూ సమానులే నని మొదటిశ్రేణి న్యాయమూర్తి జితేందర్ అన్నారు. రాయికల్ మండలం కిష్టంపేటలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడు తూ చట్టాల గురించి ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు న్యాయసేవలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్సై అజయ్, సర్పంచ్ జాన స్వరూప, ఉప సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, ఏఎస్సై దేవేందర్, కోర్టు కానిస్టేబుల్ మహేందర్, అశోక్ పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: 01 జనవరి 2024 ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించామని, అభ్యంతరాలుంటే తెలపాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఓటరు జాబితాపై ఈనెల 22లోపు అభ్యంతరాలు తెలిపితే ఫిబ్రవరి 2 వరకు పరిశీలించి ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 7,00,315 ఓటర్లు ఉన్నారని, కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం డ్రాఫ్ట్ జాబితాను రాజకీయ పార్టీలకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' పరిశీలన



రాయికల్‌లో ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీవన్ రెడ్డి

రాయికల్: కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీల దరఖాస్తులను పారదర్శంగా పరిశీలించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. దరఖాస్తులు స్వీకరించి అర్హులకు ప్రభుత్వ ఫలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ పొందనివారు 20 శాతం ఉన్నారని, 2014 తర్వాత పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వలేదని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, నాయకులు ఎద్దండి భూంరెడ్డి, పడిగెల రవీందర్‌రెడ్డి, సింగని రమేశ్, ఆది రెడ్డి, మహిపాల్‌రెడ్డి, దివాకర్, మున్ను, తిరుపతిరెడ్డి, దిలీప్, శంషేర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాలరూరల్: ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి అండర్–14 ఎస్జీఎఫ్ పోటీల్లో జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థినులు సాన్వి, లక్ష్య ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ అజీమ్ తెలిపారు. విద్యార్థినులకు శనివారం ప్రిన్సిపల్ నాగ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్ అభినందించారు.

గడువులోపు సీఎంఆర్ చెల్లించాలి

జగిత్యాల: కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ఈనెల 31 లోపు చెల్లించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం మిల్లర్లతో సమావేశమయ్యారు. సీఎంఆర్ ఇవ్వని మిల్లులను డిఫాల్టర్లుగా గుర్తించి బ్లాక్‌లిస్ట్‌లో పెడతామన్నారు. వారు ఆస్తులు జప్తు చేస్తామని పేర్కొన్నారు. లక్ష్యం ప్రకారం మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీ చేయాలని, ఎప్పటికప్పుడు నివేది క ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ ప్రభాకర్, పౌరసరఫరాల అధి కారులు, రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

వైద్యులుండరు.. సిబ్బంది రారు

- 'గతనెల 8న రాత్రి 2.30 గంటల సమయంలో పోచమ్మవాడకు చెందిన ఓదమ్మ అనే మహిళను ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు ఆమెను జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ పేషెంట్‌ను తీసుకెళ్లేందుకు సిబ్బంది లేరు. ఆమె బంధువులే స్ట్రెచర్‌పై ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. వారే సిటీస్కాన్ గదికి తీసుకెళ్లారు. అక్కడకు ఎవరూ రాకపోవడంతో ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు...' ఒకవైపు పేదలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నా ఆశించిన రీతిలో వైద్యం అందడం లేదు.

- 'ఇటీవల ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో చనిపోగా ఆస్పత్రికి తీసుకువచ్చినప్పటికీ పోస్టుమార్టం కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది..'



సిబ్బంది లేక స్ట్రెచర్‌పై పేషెంట్‌ను తీసుకొస్తున్న బంధువులు

- జగిత్యాలకు చెందిన మహిళా ఆసుపత్రిలో ప్రసవించింది. ఆమెకు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. ఆమె మళ్లీ గర్భవతి అయ్యింది. ఇది డాక్టర్ల నిర్లక్ష్యమేనని ఆమె బంధువులు ఫిర్యాదు చేసేందుకు రెండు రోజుల క్రితం వెళ్తే సూపరింటెండెంట్ అందుబాటులో లేరు. అక్కడి నుంచి వారు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఒక్క విషయంలోనే కాదు.. సూపరింటెండెంట్ అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సూపరింటెండెంట్ కుర్చీకి వినతిపత్రం →

- జిల్లా ఆసుపత్రిలో గాడి తప్పిన పాలన
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- కొరవడిన సూపరింటెండెంట్ పర్యవేక్షణ

జగిత్యాల: జగిత్యాల జిల్లా ఏర్పాటుకు ముందు 100 పడకల ఆస్పత్రిగా ఉండేది. ప్రస్తుతం ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటైంది. దీంతో జిల్లా ఆసుపత్రి జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడంతోపాటు 350 పడకలకు పెరిగింది. నిత్యం ఇక్కడ వెయ్యికి పైగా అవుట్ పేషెంట్స్.. 200కు పైగా ఇన్‌పేషెంట్స్ ఉంటారు. కానీ సుమారు 70మంది వివిధ విభాగాల్లో వైద్యులు కొనసాగుతున్నారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎప్పుడు వస్తున్నారో..? ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. క్యాజువాలిటీ విభాగంతోపాటు, సంబంధిత డ్యూటీ డాక్టర్ ఉండాలి. అందులో ఎవరూ ఉండకపోవడంతో పేద ప్రజలకు వైద్యం సక్రమంగా అందడం లేదు. ఓ వృద్ధురాలికి ప్రమాదం జరిగితే బంధువులే స్ట్రెచర్‌పై సిటీస్కాన్‌కు తీసుకెళ్లారు. సిటీ స్కాన్‌లోనూ ఎవరూ పట్టేవారు లేరు. వైద్య సిబ్బందిగానీ, ఇతర సిబ్బందిగానీ ఎవరూ రాకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జనరల్ ఆస్పత్రిలో 42 మంది సీనియర్ రెసిడెన్సీతోపాటు, 77 మంది వైద్యులుంటున్నారు. అయినప్పటికీ వైద్యం అందడం లేదంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమేనని స్పష్టంగా కన్పిస్తోంది. కోట్ల నిధులు వెచ్చించి పరికరాలు ఏర్పాటు చేసినా ప్రైవేటు ఆస్పత్రులే దిక్కుగా మారాయి.

రాత్రి సమయంలోనే ఎక్కువ పేషెంట్లు

జిల్లావ్యాప్తంగా ఏ రోడ్డు ప్రమాదాలు జరిగినా.. పాముకాటుకు గురైనా.. మరే ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తినా ఈ ఆస్పత్రికే వస్తుంటారు. ఇక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడం.. వైద్యం అందే అవకాశం లేక ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్థోమత లేక.. బిల్లులు కట్టలేక ఇబ్బంద పడుతున్నారు. కొందరు అంబులెన్స్ డ్రైవర్లు ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులుండరని, సక్రమంగా వైద్యం అందని చెప్పి ప్రైవేటుకే తీసుకెళ్తున్నారు.

అందుబాటులో పరికరాలు

జిల్లా ఆసుపత్రిలో సిటీస్కాన్, ఎంఆర్‌ఐ వంటి 57రకాల పరీక్షలు చేసేలా మిషన్లు, ల్యాబ్‌లు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పేదలకు మెరుగైన వైద్యం అందించేలా చూడటంతోపాటు, ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములును వివరణ కోరగా.. తాను ప్రొఫెసర్‌ను అని, ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. అదనపు భారంతో పర్యవేక్షణ జాప్యం అవుతోందన్నారు. ఇటీవల ట్యూబెక్టమీ వికటించిందని కొందరు ఫిర్యాదు చేశారని, ఆ అంశంపై ముగ్గురు వైద్యులతో కమిటీ వేశామని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ లేని సమయంలో వచ్చి ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇవ్వడం సరికాదని సూచించారు.

వ్యూహం.. ప్రతివ్యూహం..!

- కోరుట్ల బల్దియా వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం..?
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెంతకు పార్టీ కౌన్సిలర్లు
- మున్సిపాలిటీపై పట్టుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ యత్నాలు



కోరుట్ల మున్సిపల్ కార్యాలయం

కోరుట్ల: కోరుట్ల మున్సిపాలిటీపై పట్టు కోసం కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ముందుకు కదులుతోంది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ కౌన్సిలర్లను పార్టీలో చేర్చుకుంటోంది. మరోవైపు తమ పట్టు జారిపోనీయకుండా బీఆర్ఎస్ కీలక నేతలు ప్రతివ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌కు చెందిన వైస్‌చైర్మన్‌తోపాటు ఐదుగురు కౌన్సిలర్లను రెండురోజుల క్రితం పార్టీలో చేర్చుకున్నారు. వీరితోపాటు మరికొందరు కూడా పార్టీలో చేరతారని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. అయితే అప్రమత్తమైన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రతిదాడికి రంగం సిద్ధం చేస్తున్నారు. శనివారం కోరుట్ల బీఆర్ఎస్ కౌన్సిలర్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లినట్లు సమాచారం.

బీఆర్ఎస్ ప్రతివ్యూహం

పార్టీని వీడి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి కాంగ్రెస్‌తో జతకట్టిన వైస్ చైర్మన్ గడ్డ మీద పవన్‌పై తామే అవిశ్వాసం ప్రతిపాదించేందుకు బీఆర్ఎస్ కీలకనేతలు సన్నాహాలు చేపట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతోపాటు ప్రస్తుతం ఎమ్మెల్యే సంజయ్ ఈ దిశగా పావులు కదపడం మొదలెట్టారు. పార్టీ కౌన్సిలర్లతో శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి.. ఈ విషయంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. శనివారం కోరుట్ల బీఆర్ఎస్ కౌన్సిలర్లందరినీ హైదరాబాద్ తీసుకెళ్లి కేటీఆర్‌తో సమావేశం ఏర్పాటు చేయించినట్లు సమాచారం. పార్టీ మారిన వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి అతడిని తొలగించి మైనార్టీలకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను వైస్‌చైర్మన్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఎవరి యత్నాలు వారివే..

కోరుట్ల బల్దియాలో బీఆర్ఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్ పార్టీ మరో జాతీయ పార్టీ కౌన్సిలర్‌ను తమ వైపు మళ్లించుకోవాలని వ్యూహం పన్నినట్లు తెలిసింది. సదరు కౌన్సిలర్‌కు చైర్మన్ పదవి ఆశచూపి అవిశ్వాసం యత్నాలు సఫలీకృతం చేసేందుకు అవసరమైన డబ్బులు కూడా వెచ్చించేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన కోరుట్ల కీలక సామాజిక వర్గానికి చెందిన మరో కౌన్సిలర్ సైతం అవిశ్వాస రాజకీయాల్లో చైర్మన్ పదవిని దక్కించుకోవాలని తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మెజార్టీ కౌన్సిలర్లను మచ్చిక చేసుకునే యత్నాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. వీరి వ్యూహాలు ఇలా ఉండగా మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉండి కష్టకాలంలో పార్టీని వీడని కౌన్సిలర్‌కు చైర్‌పర్సన్ పదవిని ఇవ్వాలన్న వాదనలు పార్టీ వర్గాల నుంచి వినవస్తున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న చైర్మన్‌పై అవిశ్వాసం వరకు సమస్య వెళ్తుందా..? లేదా వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దింపుతారా..? అన్న చర్చ కోరుట్ల బల్దియాలో జోరుగా సాగుతోంది.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు



పార్టీలో చేరిన కౌన్సిలర్లతో నర్సింగరావు

మెట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీలోకి మెట్‌పల్లి మున్సిపాలిటీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు మర్రి సహదేవ్, పిప్పెర లలిత, చెర్లపల్లి లక్ష్మి, కో–ఆప్షన్ సభ్యులు మార్గం గంగాధర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మర్రి ఉమారాణి, పద్మశాలీ సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు కేసుల సురేందర్, నాయకులు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, పిప్పెర రాజేశ్, అరిసె మురళీ, జాజాల రాజగోపాల్, బీజేపీ కౌన్సిలర్ జక్కని సుజాత కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో పార్టీ చేరారు. వీరిలో మార్గం గంగాధర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ముఖ్య అనుచరుడు. గత పాలకవర్గంలో వైస్‌చైర్మన్‌గా పని చేశారు. 2018 ఎన్నికల్లో కౌన్సిలర్‌గా ఓడిపోయినా కో–ఆప్షన్ సభ్యునిగా అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్‌ను వీడడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

పంచాయతీ భవనాలు ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న విప్, జెడ్పీ చైర్‌పర్సన్

మేడిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి శనివారం ప్రారంభించారు. మండలంలోని వల్లంపల్లిలో మహిళా సమాఖ్య భవనం, గ్రామపంచాయతీ, పోరుమల్ల, తొంబరావుపేటలో పంచాయతీ భవనాలను ప్రారంభించారు. గుండ్లపల్లిలో ఏర్పాటుచేసిన కృతజ్ఞత సభలో పాల్గొన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, ఎంపీపీ దొనకంటి ఉమాదేవి, సర్పంచులు వెల్మ సమత, తొటి తిరుపతి, మామిడి సత్తమ్మ, సంపత్, నాయకులు పాల్గొన్నారు. ముందుగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.

అభయహస్తం అయోమయంపై స్పష్టత ఇవ్వాలి

జగిత్యాలజోన్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభయహస్తంపై ప్రజల్లో అయోమయం ఉందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని జెడ్పీ చైర్‌పర్సన్ వసంత అన్నారు. జెడ్పీ కార్యాలయంలో శనివారం అధికారులతో కలిసి సమీక్షించారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాలకు పెద్దపీట వేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని, జిల్లాను రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలిపామని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలును దరఖాస్తులకే పరిమితం చేయకుండా అర్హులందరికీ అందించాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ దివాకర, జెడ్పీ సీఈఓ రఘువరన్, డీఆర్‌డీఏ పీడీ నరేశ్, డీపీవో దేవరాజం, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'కు 3,60,923 దరఖాస్తులు

జగిత్యాల: ప్రజాపాలనలో 3,60,923 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. చివరిరోజు 15 గ్రామపంచాయతీలు, 134 మున్సిపల్ వార్డుల్లో సమావేశం నిర్వహించామని, పంచాయతీల్లో 31,533, వార్డుల్లో 4,770, జిల్లావ్యాప్తంగా 36,303 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 2,42,356, మున్సిపాలిటీల్లో 77,435 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

మహిళలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం/సారంగాపూర్: మహిళలు, యువతులు అన్యాయానికి గురైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మహిళల రక్షణకు షీటీం, యాంటీఉమెన్ ట్రాకింగ్ టీంలు పనిచేస్తున్నాయని, 77 హాట్‌స్పాట్లలో నిఘా పటిష్టం చేశామని పేర్కొన్నారు. జిల్లాలో షీటీం బృందాల ద్వారా 25వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. షీటీంకు 30 ఫిర్యాదులు రాగా 12కేసులు నమోదు చేసి 18 ఈ పీటీ కేసులు నమోదు చేశామన్నారు. మహిళలు సోషల్ మీడియాపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. డయల్ 100కు కాల్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ అరిఫ్‌అలీఖాన్, ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పూర్వ వీఆర్ఏల నిరీక్షణకు తెర

- గుర్తింపు కార్డుల జారీకి ప్రభుత్వం ఆదేశం
- వారం రోజుల్లో పూర్తికానున్న ప్రక్రియ
- ట్రెజరీకి చేరిన పెండింగ్ వేతనాలు
- త్వరలో ఖాతాల్లో జమ
- ఉమ్మడి జిల్లాలో 2,147 మందికి పదోన్నతి
- 61 ఏళ్లు దాటినవారి విషయంలో రాని స్పష్టత



ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు (ఫైల్)

కరీంనగర్ అర్బన్: వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్ఏల నిరీక్షణకు తెర పడింది. గుర్తింపు కార్డులు, జీతాలు లేక అధికారులు, పాలకుల చుట్టూ తిరగగా తాజా ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఐడీ కార్డులతోపాటు ఆయా శాఖల ద్వారా వేతనాలు చెల్లించాలని ఆదేశించింది. ఇప్పటికే ఐడీ కార్డుల జారీ చేపడుతుండగా వారం రోజుల్లో ప్రక్రియ పూర్తవనుంది. వేతనాలు ట్రెజరీకి చేరగా త్వరలో ఉద్యోగుల ఖాతాలో జమ కానున్నాయి.

తాత్కాలిక రిజిస్టర్‌లోనే సంతకాలు

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2,147 మంది వీఆర్ఏలకు పదోన్నతి ఇచ్చి, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల్లో జూనియర్, రికార్డు అసిస్టెంట్లుగా సర్దుబాటు చేయగా కొందరిని ఇతర జిల్లాలకు పంపించారు. వీరు కరీంనగర్ జిల్లాలో 658, జగిత్యాల జిల్లాలో 592, పెద్దపల్లి జిల్లాలో 512, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 345 మంది ఉన్నారు. ఇది జరిగి 5 నెలలు గడుస్తోంది. అయినప్పటికీ వీరు పని చేసే అయా కార్యాలయాల్లో తాత్కాలిక రిజిస్టర్‌లోనే సంతకాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి ఎంప్లాయీ ఐడీలు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ శాఖల్లో పని చేస్తున్న పూర్వ వీఆర్ఏలు తమ దరఖాస్తులను మండలాల వారీగా ఇస్తున్నారు. ట్రెజరీ అధికారులు ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఐడీ జనరేట్ అయినవారికి ప్రింట్ తీసి, అందిస్తున్నారు.

ఆయా శాఖల నుంచే వేతనాలు

వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్ కార్యాలయాల పరిధిలో మాత్రమే పనిచేసే వీరిని క్రమబద్ధీకరించిన తర్వాత విద్యార్హతను బట్టి వివిధ శాఖల్లో నియమించింది. కొందరిని వివిధ శాఖలకు బదిలీ చేయగా, మరికొందరికి రెవెన్యూ శాఖలోనే విధులు అప్పగించింది. గతేడాది ఆగస్టులో వీరిని క్రమబద్ధీకరించగా.. అప్పటి నుంచి వేతనాల మంజూరుపై ఎలాంటి స్పష్టత లేదు. దీంతో తమ జీవితం దుర్భరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వ వీఆర్ఏలను గుర్తించి, వేతనాలు చెల్లించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖల్లో పని చేస్తున్నవారికి ఉపశమనం కలిగింది. జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న పూర్వ వీఆర్ఏలకు రూ.24,280, రికార్డ్ అసిస్టెంట్లుగా చేస్తున్న వారికి రూ.22,150, సబార్డినేట్లుగా ఉన్నవారికి రూ.19 వేల చొప్పున జీతాలు ఖరారు చేశారు. కానీ, 5 నెలలుగా అందకపోవడంతో ధర్నాలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆలస్యమైంది. తాజాగా వారి వినతికి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏ శాఖలో పని చేస్తున్న వారి కి ఆ శాఖ నుంచే వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు.

61 ఏళ్లు దాటినవారు 400 మందికి పైనే

61 ఏళ్లు పైబడిన పూర్వ వీఆర్ఏల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. సర్దుబాటైన వారికి ఐడీ కార్డులు, వేతనాలపై స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం వీరిని విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 400 మందికి పైగా ఉండగా కొందరు మరణించారు. ఇంకొందరు మంచంపట్టారు. ఈ నేపథ్యంలో వారి వారసులు విధులు నిర్వహించగా గత ప్రభుత్వం వారసులకు ఉద్యోగాలను ఇస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటివరకు దీనిపై ప్రకటన లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమ తండ్రి, తాత ఉద్యోగం వస్తుందని విధులు నిర్వహించామని, ఇతర ఉద్యోగాలకు సిద్ధమవ్వాలంటే వయసు దాటిపోయిందని వాపోతున్నారు. కాగా, వివిధ శాఖల్లో సర్దుబాటు అయిన పూర్వ వీఆర్ఏల దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నామని ట్రెజరీ అధికారులు తెలిపారు.

వేతనాలు జమ చేయాలి



మేము 5 నెలలుగా దుర్భర జీవితం గడుపుతున్నాం. అప్పులు చేసి, కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగమని సంతోషపడితే నెలల తరబడి జీతం లేకుంటే బతికేదెలా? ప్రభుత్వం వేతనాలను త్వరగా జమ చేయాలి.

– నలువాల సాయికిషోర్, వార్డు ఆఫీసర్, కొత్తపల్లి

క్లుప్తంగా

రాజన్న సేవలో విప్ లక్ష్మణ్



కోడె మొక్కులు చెల్లిస్తున్న విప్ లక్ష్మణ్

వేములవాడ: వేములవాడ రాజన్నను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారిని సుమారు ఐదువేల మంది దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, లక్ష్మారెడ్డి, ధర్మేందర్, లక్ష్మిరాజం పర్యవేక్షించారు.

గాజులే జీవనం.. గుడిమెట్లే ఆధారం

రాజన్న భక్తులే ఆధారంగా చిరు వ్యాపారం

- ఇక్కడి నుంచి గాజులు తీసుకెళ్లడం ఆనవాయితీ..
- గాజులు విక్రయించి ఉపాధి పొందుతున్న 50 మంది మహిళలు
- దక్షిణ ద్వారం వద్ద విక్రయాలు
- అద్దె ఇంట్లో ఉంటూ.. కుటుంబాలకు అండగా నిలుస్తూ..

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న ఆలయ దక్షిణ ద్వారం మెట్ల వద్ద దాదాపు 50 మంది మహిళలు గాజుల గంపలతో కూర్చొని కనిపిస్తారు. వీరంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. వేములవాడ స్థానికులు పది మంది వరకు ఉంటే.. మిగతా వారంతా వరంగల్, పెద్దపల్లి, సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాల నుంచి వచ్చిన వారు. వారంతా ఇక్కడ అద్దె ఇళ్లలో ఉంటూ గాజులు విక్రయిస్తున్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు గాజులు విక్రయిస్తూ కుటుంబాలను సాదుకుంటున్నారు.

గాజులు కొనడం ఆనవాయితీ

రాజన్న దర్శనానికి వచ్చే భక్తులలో చాలా మంది తమ బంధువులు, ఇంటి చుట్టుపక్కల వారి కోసం ఇక్కడి నుంచి గాజులు తీసుకెళ్లడం ఆనవాయితీ. భక్తుల నమ్మకమే వ్యాపారంగా వీరు ముందుకెళ్తున్నారు. గతంలో గాజుల విక్రయానికి గంపనెత్తిన పెట్టుకొని పల్లెల్లో తిరిగేవారు. ఇప్పుడు అందరూ పట్టణాల్లోని లేడీస్ ఎంపోరియంలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో పల్లెల్లో గిరాకీ ఉండడం లేదని ఎవరూ గాజుల వ్యాపారులు వెళ్లడం లేదు.



ఎములాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల ఆధారంగా పలు కుటుంబాలు బతుకుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు ఇక్కడ జాతరలో పలు వస్తువులు కొంటుంటారు. ఇలా భక్తుల కోసం దుకాణాలు పెట్టుకున్న వారు వ్యా పారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇలాంటి కోవలోకే వస్తారు గాజులు అమ్మే మహిళలు. అనాదిగా జీవనోపాధిగా వస్తున్న వ్యాపారాన్ని నమ్ముకొని వేములవాడలో దాదాపు 50 మంది వరకు మహిళలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి గాజులు విక్రయిస్తున్నారు. తమ కుటుంబాలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

ఆది, సోమవారాల్లో గిరాకీ ఎక్కువ

రాజన్న ఆలయానికి ఆది, సోమవారాల్లో భక్తులు అధికంగా వస్తుంటారు. గాజుల గిరాకీ బాగా ఉంటుంది. ఆ రెండు రోజుల్లో దాదాపు రూ.1000 నుంచి రూ.1200 వస్తుంటాయని మహిళా వ్యాపారులు తెలిపారు. మిగతా రోజుల్లో రూ.400 నుంచి రూ.500 వస్తుంటాయని అంటున్నారు.

రాజన్నను నమ్ముకున్నం



బతుకుదెరువు కోసం రాజన్న ఆలయం గుడి మెట్ల వద్ద గాజులు అమ్ముతున్న. రాజన్నను నమ్ముకొని గాజుల వ్యాపారం చేస్తున్నాం. – కృష్ణవేణి, నగునూర్

రోజూ ఇక్కడే ఉంటాం



బతుకమ్మ, దసరాకు గాజులు అమ్ముకునేందుకు ఊళ్లలోకి వెళ్తాను. మిగతా ఏడాది మొత్తం రాజన్న ఆలయ దక్షిణ ద్వారం మెట్ల వద్దనే గాజులు అమ్ముతాను. – విజయ, వేములవాడ

పన్నెండేళ్లుగా ఇక్కడే..



వేములవాడకు వచ్చి పన్నెండేళ్లు అవుతుంది. రాజన్న మెట్ల వద్దనే గాజులు అమ్ముతున్నా. కుటుంబంతో వచ్చి ఇక్కడే అద్దె ఇంట్లోనే ఉంటున్నాము. పండుగలకు మాత్రం సొంతూరికి వెళ్తాం. – భాగ్యలక్ష్మి, హుజూరాబాద్

ఆది, సోమవారాల్లో గిరాకీ



రాజన్న ఆలయం వద్ద గాజులకు ఆది, సోమవారాల్లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఈ రోజుల్లోనే భక్తులు అధి కంగా వస్తుంటారు. భక్తుల రద్దీ పెరిగితే మాకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. – స్వప్న, పెద్దపల్లి

జాతీయ పోటీలకు 'మానేరు' విద్యార్థి



అమన్‌ను అభినందిస్తున్న సునీతారెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: పంజాబ్‌లోని లూథియానలో నేటినుంచి జరిగే 67వ జాతీయస్థాయి పాఠశాలల అండర్–17 జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థి అమన్‌రెడ్డి ఎంపికయ్యాడని పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అమన్‌రెడ్డి రాణించాడు. శనివారం అమన్‌రెడ్డిని పాఠశాల డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు జహదా అభినందించారు.

కేసు నమోదు

చందుర్తి (వేములవాడ): చందుర్తి మండలం రామన్నపేటలో ఓ యువకుడు విద్యుత్ కంచె తగిలి గాయపడగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన ఓ రైతు కూరగాయాల పంటరక్షణ కోసం విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. గత నెల 25న ఇదే గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి కంచె తగిలి గాయపడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సదరు రైతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ వివరించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని హనుమాన్‌వాడకు చెందిన బోగ సౌమ్య (35) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హనుమాన్‌వాడకు చెందిన సౌమ్యకు పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌తో వివాహమైంది. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పుట్టింట్లో ఉన్న సౌమ్య శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు.

నిప్పంటించుకుని వృద్ధురాలు

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్‌కు చెందిన ఒల్లెం మల్లు(78) శుక్రవారం అర్ధరాత్రి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఒల్లెం మల్లు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిందని ఒల్లెం మల్లు కొడుకు ఒల్లెం మల్లేశం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్‌కు చెందిన ఎండీ.యాకుబ్ పాషా(31) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం రాత్రి పురుగుల మందుతాగాడు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. యాకుబ్‌పాషా స్థానికంగా సెల్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇంటి సమీపంలో గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

ఇద్దరు యువకుల అరెస్ట్

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేట శివారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గోల్కొండ హరీశ్, గాండ్ల సాయినితిన్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా 550 గ్రాముల గంజాయి దొరికింది. తహసీల్దార్ శేఖర్ వచ్చి పంచనామా చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్

కరీంనగర్: కరీంనగర్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం అందజేసిన జర్నలిస్టుల నివేశన స్థలాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఇళ్ల స్థలాల పనులు నిలిపివేతపై స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే గంగుల కలెక్టర్ పమేలా సత్పతితో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్‌తో చర్చించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో అర్హులైన జర్నలిస్టులకు అందజేయడం జరిగిందని.. వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేసి జర్నలిస్టులు ఇళ్ల నిర్మాణాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాము ఎల్లప్పుడూ జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపాటుడతామ ని.. వారికి అండగా ఉంటానని జర్నలిస్టులు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టర్ పమేలా సత్పతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి బొకే అందజేశారు. ఆయన వెంట మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తదితరులున్నారు.

గంజాయి కేసుల్లో ఏడుగురి బైండోవర్



నిందితులను బైండోవర్ చేస్తున్న పోలీసులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతంలో గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న ఏడుగురిని శనివారం పోలీసులు బైండోవర్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గోదావరిఖని వన్‌టౌన్, మంచిర్యాల, బెల్లంపల్లి వన్‌టౌన్, చెన్నూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న ఎల్పుల సాయి చందర్, ఎస్‌కే.జమీర్, జాడి సాయిపవన్, ఎండీ.అన్వర్, గుజ్జుల సాయి తేజ, భీముల అలియాస్ బేబుల అంజితోపాటు మరొకరిని బైండోవర్ చేశారు. మరోసారి గంజాయి అక్రమ రవాణాకు పాలపడితే జైలుశిక్ష ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

బతుకు పోరులో ఆగిన ఊపిరి

- సౌదీలో దమ్మన్నపేట వాసి మృతి
- మృతదేహం కోసం ఎదురుచూపులు




రాజన్న(ఫైల్)

ధర్మపురి: బతుకుపోరులో ఏడారిదేశం వెళ్లిన వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడు. కొద్ది రోజులు చికిత్స పొంది స్వదేశానికి వస్తుండగా.. అక్కడి ఎయిర్‌పోర్టు అధికారులు అనుమతించలేదు. దీంతో తోటి కార్మికుల గదిలో ఆశ్రయం పొందాడు. అక్కడ సరైన వైద్యం అందక ఈనెల 4న చనిపోయాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న(50) 11ఏళ్లుగా ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్తున్నాడు. అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఏడాదికోసారి ఇంటికొచ్చి వెళ్తుండేవాడు. రెండుమాసాల క్రితం గది నుంచి డ్యూటీకి వెళ్తుండగా పక్షవాతంతో రోడ్డుపై పడిపోయాడు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆరుగంటలు కొట్టుమిట్టాడు. అక్కడే ఉంటున్న రాజన్న తమ్ముడు తిరుపతి విషయం తెలుసుకుని ఆస్పత్రికి తరలించాడు. కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోగా.. ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రివారు డిశ్చార్జీ చేశారు. దీంతో తన గదికి తీసుకెళ్లిన తిరుపతి రాజన్న భార్య, ఇద్దరు పిల్లలకు సమాచారం ఇచ్చాడు. వారు స్వగ్రామానికి తీసుకురావాలని సూచించగా.. డిసెంబర్ 22న బయల్దేరారు. సౌదీ ఎయిర్‌పోర్టులో పరీక్షలు చేసిన అధికారులు బీపీ, షుగర్ అధికంగా ఉందని ప్రయాణానికి అనుమతించలేదు. దీంతో రాజన్నను తిరిగి గదికి చేర్చారు. సరైన వైద్యం అందకపోవడంతో ఈనెల 4న మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు తిరుపతి, అక్కడి తెలుగువాళ్లు ప్రయత్నిస్తున్నారు. రాజన్నకు 11ఏళ్ల బీమా, లీగల్ డబ్బులు కంపెనీ చెల్లించాలని కోరుతూ టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా విదేశీ వ్యవహారాలశాఖకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

లక్షలు పోసినా.. దక్కని ప్రాణం

- అనారోగ్యంతో యువకుడి మృతి



సతీశ్(ఫైల్)

ధర్మపురి: ఆడుతూ.. పాడుతూ ఆనందంగా ఉన్న కొడుకు ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించి లక్షలు వెచ్చించినా ప్రాణం దక్కలేదు. నాడు భర్త.. నేడు కొడుకు మృతితో ఆ తల్లి కన్నీరుమున్నీరవుతోంది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన దూడ శంకరమ్మ భర్త 2012లో అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి కూలీపని చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లు, కొడుకు సతీశ్(20)ను పోషిస్తోంది. డిగ్రీ చదువుతూనే జగిత్యాల జిల్లా ఆస్పత్రిలో ఎంఎల్‌టీగా పనిచేస్తున్న సతీశ్ ఈనెల 1న జ్వరంతో జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు కిడ్నీ, లివర్ చెడిపోయాయని తెలిపారు. కొడుకును బతికించుకోవడం కోసం శంకరమ్మ రూ.3లక్షల వరకు అప్పుచేసింది. ఐదు రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందిన సతీశ్ శుక్రవారం ఆస్పత్రిలో చనిపోయాడు. 'తండ్రి లేని తమకు అండగా ఉంటాడని అనుకుంటే నువ్వూ అక్కడికే వెళ్లావా' అంటూ కుటుంబసభ్యులు రోదించిన తీరు కన్నీరు పెట్టించింది. శనివారం సతీశ్ అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు



గాయపడిన బాలుడు

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లిలో శనివారం పిచ్చికుక్క పలువురిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన దొమ్మటి రవి, బొల్లమల్ల శివ, దుర్గం రాఘవ, పోగుల కౌశిక్ గాయపడ్డారు. వీరికి కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. పిచ్చికుక్కల బెడదతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అవిశ్వాసంపై హైకోర్టు స్టే

రామడుగు: రామడుగు ఎంపీపీ కలిగేటి కవితపై పదిమంది ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే ఇచ్చింది. డిసెంబర్ 19న పదిమంది ఎంపీటీసీలు ఆర్డీవోను కలిసి నోటీసులు అందజేశారు. అధికారులు ఈ నెల 8న బలనిరూపణ కోసం నోటీసులు ఇచ్చారు. దీనిపై ఎంపీపీ కలిగేటి కవిత హైకోర్టును ఆశ్రయించడంతో 10వ తేదీ వరకు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ కాపీలను ఎంపీపీ కలెక్టర్, ఆర్డీవో, జెడ్పీ సీఈవోకు అందించారు.

నూతన నియామకం

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో– ఆర్డినేటర్‌గా సర్దార్ నాగేందర్ సింగ్‌ను నియమించినట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి, ముఖ్య సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్ణయం మేరకు నియామకం చేసినట్లు వెల్లడించారు.

10వ తేదీ వరకే పెండింగ్ చలాన్ల రాయితీకి గడువు

కోల్‌సిటీ: వాహనదారులకు పెండింగ్ చలాన్ల చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీ గడువు ఈనెల 10వ తేదీ వరకే ఉంటుందని, 11వ తేదీ నుంచి పూర్తిస్థాయి డబ్బులను చెల్లించాల్సి ఉంటుందని రామగుండం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్లక్ష్యం వహించిన వారు 11వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో చలాన్లకు డబ్బులు చెల్లించడమే కాకుండా, పోలీసులు తనిఖీ చేసే సమయంలో ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

విద్యార్థి అదృశ్యం



వినయ్

జమ్మికుంట: కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి బయల్దేరిన విద్యార్థి అదృశ్యం అయ్యాడు. ఎస్సై శ్రీధర్ వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఉయ్యాల వినయ్ తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. గత నెల 31న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి బయల్దేరి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ పేర్కొన్నారు.

'శాతవాహన' భూమి ఆక్రమణకు యత్నం

- వన్‌టౌన్‌లో కేసు నమోదు

కరీంనగర్‌క్రైం: మానేరు డ్యాం సమీపంలోని శాతవాహనయూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు చెందిన భూమిని ఆక్రమించేందుకు యత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు, వీసీ మల్లేశం వివరాల ప్రకారం అలకాపురి కాలనీకి చెందిన కొత్త వీరారెడ్డి, మరికొంత మంది ఈనెల 3న ఫార్మసీ కళాశాలలోకి వచ్చారు. జేసీబీతో క్యాంపస్‌లోని ఓ షెడ్డు, మొక్కలను కూల్చేసి, స్థలాన్ని చదును చేశారు. ఈ విషయమై అధికారుల ఫిర్యాదుతో ఈ నెల 5న కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు శనివారం ఫార్మసీ కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. కళాశాల భూములు కాపాడాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు వారిపై వన్‌టౌన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. టౌన్ ఏసీపీ నరేందర్, వర్సిటీ వీసీ మల్లేశం కబ్జాకు గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. భూ కబ్జాకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీసీ ఏసీపీని కోరారు.

'కళాశాల భూమి కబ్జా చేయాలని చూస్తే ఊరుకోం'

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల భూమిని కబ్జా చేయాలని చూస్తే ఊరుకోబోమని, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సంకసాల మల్లేశ్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం కళాశాల పక్కనే ఉన్న భూమికి చెందిన వీరారెడ్డి తన స్థలంలో పని చేసుకుంటామని వచ్చి, ప్రిన్సిపాల్ ఏఆర్ కిశోర్ వద్ద అనుమతి తీసుకున్నాడని తెలిపారు. కానీ, కళాశాల భూమిలో నుంచి రోడ్డు వేసేందుకు చదును చేయగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఏసీపీ వచ్చి, సంఘటన స్థలాన్ని పరిశీలించారని, వీరారెడ్డి మనుషులను అక్కడి నుంచి పంపించారని పేర్కొన్నారు. జేసీబీలు, బేడ్ బండ్లను సీజ్ చేసి, అతన్ని అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఫార్మసీ కళాశాల భూమిని ఇకపై ఎవరూ కబ్జా చేయకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తున్నామని తెలిపారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



విద్యార్థులతో చైర్మన్ డా.నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహాగణపతి, గౌరీమాత విగ్రహాలకు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 400మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. అదే విధంగా రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు జమ్మికుంట వాసి



పతకాలు అందుకుంటున్న అంబాల ప్రభాకర్

జమ్మికుంట: జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ మహారాష్ట్రలోని పూణేలో ఫిబ్రవరి 13 నుంచి 17వ తేదీ వరకు వరకు నిర్వహించే జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపికయ్యాడని మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి రామారావు తెలిపారు. మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జింకానాగ్రౌండ్‌లో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి డిస్కస్‌త్రోలో బంగారుపతకం, హైమార్‌త్రోలో వెండి పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు.

పథకాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్

కరీంనగర్‌కల్చరల్: పేదరిక నిర్మూలనకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ అన్నారు. శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం కరీంనగర్–4 ను సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. బాల బాలికలకు భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, విద్యార్థులకు ఉపయోగపడే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చక్కగా చదువుకొని, క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేశ్, వసతి గృహం నిర్వాహకురాలు పద్మజ పాల్గొన్నారు.

అలరించిన 'టైంలెస్ వోయేజ్'

- ఆకట్టుకున్న నృత్యాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రసాదరావు



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో 'టైంలెస్ వోయేజ్' పేరుతో శనివారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పారమిత, ఎక్స్‌ప్లోరికా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అద్భుత ప్రదర్శనతో విద్యార్థులు అలరించారు. ఈ విద్యాసంవత్సరంలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను నగదు, జ్ఞాపికలతో సత్కరించారు. పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహత, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రాము, రబీంద్ర పాత్రో, హరిప్రియ, సరిత పాల్గొన్నారు.